ప్రజాశక్తి
శుక్రవారం 28 ఏప్రిల్ 2023
5
శ్రీకాకుళం

ఇంటర్ విద్యార్థి బలవన్మరణం

దండుగోపాలపురంలో విషాదఛాయలు

తరుణ్(ఫైల్)

ప్రజాశక్తి - టెక్కలి రూరల్, నౌపడ

ఇంటర్ పరీక్ష తప్పానన్న బాధ ఓ వైపు.., చుట్టు పక్కల వారు, తోటి స్నేహితులు ఏమంటారు!. వారికేం సమాధానం చెప్పాలన్న భయం మరోవైపు.., కూలి పనులు చేస్తూ చదివిస్తున్న తల్లిదండ్రులకు, పెంచుతున్న తాతయ్యకు ఏం చెప్పాలో తెలియక ఆలోచనలు అన్నీ మూకుమ్మడిగా దాడి చేస్తుంటే.. వాటి అన్నింటికీ చనిపోవడమే పరిష్కారం అనుకున్నాడో! ఏమో..! రైలు కింద తలపెట్టి ఇంటర్ విద్యార్థి బలవన్మరణం పొందాడు. ఆ తల్లిదండ్రులకు కడుపుకోత మిగిల్చాడు. పూర్తి వివరాలిలా ఉన్నాయి..

సంతబొమ్మాళి మండలం దండు గోపాలపురం గ్రామానికి చెందిన బాలక తరుణ్(16). టెక్కలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ఎంపిసి ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. తల్లిదండ్రులు కష్ణారావు, గౌరమ్మలకు తరుణ్ ద్వితీయ సంతానం. వీరు ఉపాధి నిమిత్తం చెన్నైలో కూలి పనులు చేస్తుండగా, కృష్ణారావు తన తండ్రి వద్ద చిన్న కుమారుడిని ఉంచి చదివిస్తున్నారు. బుధవారం రాత్రి వెలువడిన ఇంటర్ పరీక్షల్లో తరుణ్ తప్పడంతో ఎవరికీ చెప్పండా ఇంటి నుంచి వెళ్లిపోయాడు. గురువారం ఉదయం టెక్కలి జిల్లా ఆస్పత్రి సమీపంలో రైలుపట్టాలపై తరుణ్ మృతదేహం కనిపించడంతో అంతా విషాదం అలముకుంది. మృతునికి అన్నయ్య హరికృష్ణ ఉన్నారు. మృతదేహాన్ని టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. పలాస జిఆర్‌పి పోలీసులు కేసుదర్యాప్తు చేస్తున్నారు.

దిగజారిన ఫలితాలు

- ప్రభుత్వ కళాశాల్లో 46.44 శాతం ఉత్తీర్ణత
- పేదరికం, పరిస్థితుల ప్రభావంతో చదువుపై కానరాని ఏకాగ్రత
- 75 శాతంపైగా ఉత్తీర్ణత సాధించిన వసతి గృహ విద్యార్థులు
- వసతి గృహాల అవసరాన్ని సూచిస్తున్న ఫలితాలు

ప్రజాశక్తి -శ్రీకాకుళం ప్రతినిధి

ఇంటర్ పరీక్ష ఫలితాల్లో జిల్లా సాధించిన ఉత్తీర్ణతా శాతం తీవ్ర నిరాశ పరిచింది. ప్రథమ, ద్వితీయ ఫలితాలకు సంబంధించి రెండింటిలోనూ రాష్ట్రంలో జిల్లా పదకుండో స్థానంలో నిలబడటం అందరిన్నీ అసంతృప్తికి గురి చేసింది. గతేడాదితో పోలిస్తే మరింత అధ్వాన పరిస్థితి కనిపిస్తోంది. 2022 జూన్‌లో వెలువడిన ఫలితాల్లో ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో పదో స్థానం సాధించగా ఈ ఏడాది ఒక మెట్టు కిందికి జారింది. అదేవిధంగా గతేడాది ప్రథమ సంవత్సరం ఫలితాల్లో ఎనిమిదో స్థానం రాగా ఈ సంవత్సరం మూడు స్థానాలు కిందికి పడిపోయింది. పేదరికం, పరిసరాల ప్రభావం తదితర కారణాలతో జిల్లా ఉత్తీర్ణతా శాతంపై ప్రభావం చూపుతున్నాయన్న అభిప్రాయం వినిపిస్తోంది. ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షల్లో జిల్లాలో ఈ ఏడాది 64శాతం మందే పాసయ్యారు. ప్రథమ సంవత్సరం ఫలితాల్లో 51 శాతం ఉత్తీర్ణత సాధించారు. వీరిలో ప్రభుత్వ యాజమాన్యం కింద నడుస్తున్న జూనియర్ కళాశాలలు 66.32 శాతం ఉత్తీర్ణత సాధించాయి. మొత్తం 93 పాఠశాలల నుంచి 8,784 మంది పరీక్షలు రాయగా 5,826 మంది పాసయ్యారు. వీటిలో ప్రభుత్వం జూనియర్ కళాశాలల ఉత్తీర్ణతా శాతం చాలా తక్కువగా ఉంది. జిల్లాలో 46 కళాశాలల నుంచి 6,960 మంది పరీక్షలు రాయగా 3,246 మంది(46.64శాతం) ఉత్తీర్ణులయ్యారు. ప్రభుత్వ యాజమాన్యంలో ఉన్న ఇతర కళాశాలలు మంచి ఫలితాలు సాధిస్తున్నా జూనియర్ కళాశాలల ఉత్తీర్ణత శాతం నామమాత్రంగా ఉండటంతో దాని ప్రభావం మొత్తం జిల్లాపై పడుతోంది. జిల్లాలో ప్రయివేట్, కార్పొరేట్ కళాశాల విద్యార్థులు 63.11 శాతం మంది పాసయ్యారు. జిల్లాలో మొత్తం 13,802 మంది పరీక్షలకు హాజరుకాగా 8,711 మంది ఉత్తీర్ణత సాధించారు.

ఉత్తీర్ణతా శాతం తగ్గుదలకు కారణాలివే

జూనియర్ కళాశాలల్లో అనుభవజ్ఞులైన అధ్యాపకులు, మంచి సబ్జెక్టు నిపుణులు ఉంటున్నారు. మెరుగైన బోధన కూడా ఉంటోంది. సౌకర్యాలు బాగానే ఉంటున్నాయి. ఫలితాల దగ్గరకొచ్చేసరికి ఆ రకమైన ప్రగతి మాత్రం కనిపించడం లేదు. దీనికి అనేక కారణాలు కనిపిస్తున్నాయి. జూనియర్ కళాశాల్లో విద్యార్థులు ఉదయం 9.30 గంటల నుంచి అధ్యాపకుల పర్యవేక్షణలో ఉంటున్నారు. దీంతో కొంత వరకైనా చదువుపై దృష్టి సారిస్తున్నారు. ఇళ్లకు వెళ్లిన తర్వాత చదువులపై వారు పెద్దగా ఏకాగ్రత చూపలేకపోతున్నారు. నివాస ప్రాంతాలు, ఇళ్లల్లో పరిస్థితులు విద్యార్థులపై కొంత ప్రభావం చూపుతున్నాయి. తల్లిదండ్రులు పేదలు కావడంతో ఏవో కూలి పనులు చేసుకుని రాత్రి ఏదో వేళకు ఇళ్లకు చేరుకుంటారు. దీంతో సహజంగానే వారిపై పర్యవేక్షణ తక్కువగా ఉంటోంది. ఇంట్లో పెద్దల నియంత్రణ తక్కువగా ఉండటంతో ఆటలు, సినిమాలు, షికార్ల పేరుతో కొంత సమయం వృథా చేస్తున్నారు

బాలికల్లో భిన్నమైన పరిస్థితి

ఆడపిల్లల విషయానికి వచ్చే సరికి ఇంటి పనులు చేస్తూనే చదువుకు కొంత సమయం కేటాయిస్తున్నారు. దాని ఫలితంగానే ప్రథమ, ద్వితీయం రెండింటిలోనూ బాలికల మంచి ఉత్తీర్ణతా శాతం సాధించారు. పరీక్షలకు 11,913 మంది, బాలికలకు 8,397 మంది ఉత్తీర్ణత (70శాతం) సాధించారు. బాలురల్లో 9,839 మంది పరీక్షలు రాయగా 5,622 మంది (57శాతం) పాసయ్యారు. ప్రథమ సంవత్సరం పరీక్షలకు బాలికలు 12,559 మంది పరీక్షలు రాయగా 7,119 మంది (57శాతం) మంది ఉత్తీర్ణత సాధించారు. బాలురల్లో 10,216 మంది పరీక్షలకు హాజరుకాగా 4,397 మంది (43 శాతం) మంది పాసయ్యారు. బాలికలు సాధించిన ఉత్తీర్ణతా శాతంతో జిల్లా అట్టడుగుకు చేరకుండా పరువు దక్కింది.

వసతిగృహాల్లో మంచి ఫలితాలు

సాంఘిక, గిరిజన సంక్షేమశాఖల ఆధ్వర్యంలో నడుస్తున్న రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలు ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో మంచి ఉత్తీర్ణతా శాతం సాధించాయి. జిల్లాలో 12 సాంఘిక సంక్షేమశాఖ వసతిగృహాల నుంచి 793 మంది పరీక్షలకు హాజరు కాగా 630 మంది (79.45శాతం) పాసయ్యారు. అదేవిధంగా జిల్లాలో ఉన్న నాలుగు గిరిజన సంక్షేమ వసతి, గురుకులాల నుంచి 465 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 360 మంది (77.42శాతం) మంది పాసయ్యారు. మోడల్ స్కూల్స్ మంచి ఫలితాలను సాధించాయి. జిల్లాలో 14 మోడల్ స్కూళ్ల నుంచి 1038 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 708 మంది(68.21శాతం) పాసయ్యారు. కెజిబివిల్లో చదువుతున్న బాలికలు సైతం మంచి ఉత్తీర్ణత శాతం సాధించారు. జిల్లాలోని 17 కెజిబివిల నుంచి 552 మంది విద్యార్థినులు పరీక్షలకు హాజరు కాగా 364 మంది (65.94శాతం) పాసయ్యారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలు (46.44శాతం) మినహా మిగిలిన కళాశాలన్నీ జిల్లా ఉత్తీర్ణతా శాతం (64శాతం) కంటే ఎక్కువగానే సాధించాయి. అధ్యాపకుల నిరంతర పర్యవేక్షణలో ఉండటం, చదువు తప్ప వేరే ధ్యాస ఉండకపోవడంతో విద్యార్థులు ఆ రకమైన ఉత్తీర్ణతా శాతం సాధించారు. ఈ నేపథ్యంలో పేద విద్యార్థులకు మరిన్ని రెసిడెన్షియల్ కళాశాలల అవసరాన్ని ప్రస్తుత ఫలితాలు సూచిస్తున్నాయి. ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టాలని విద్యావంతులు, మేధావులు కోరుతున్నారు.

జెడ్‌పి సిఇఒకు వినతిపత్రం అందిస్తున్న యుటిఎఫ్ నాయకులు

పిఎఫ్ ఖాతాలను వెంటనే ఆన్‌లైన్ చేయాలి

జెడ్‌పి సిఇఒను కోరిన యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో ఉద్యోగులు, ఉపాధ్యాయుల పిఎఫ్ ఖాతాలు ఆన్‌లైన్ చేయాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి చౌదరి రవీంద్ర, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి పి.అప్పారావు, ఎస్.కిషోర్‌కుమార్ కోరారు. గురువారం జెడ్‌పి సిఇఒ ఆర్.వెంకటరామన్‌ను కలిసి వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ జిల్లాలో 2019-20 ఆర్థిక సంవత్సరం నుండి నేటి వరకు పిఎఫ్ జమ వివరాలు ఆన్‌లైన్‌లో పొందుపర్చలేదన్నారు. సంబంధిత ఖాతాల లెడ్జర్‌లో గత మూడేళ్ల నుంచి నమోదు చేయలేదని చెప్పారు. నెల వారీ జమలు, డిఎ అరియర్స్ వంటివి జమయ్యాయో, లేదో తెలుసుకునే పరిస్థితి లేకుండా చేశారని, దీంతో ఉపాధ్యాయులు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. గతంలో చాలా పర్యాయాలు పిఎఫ్ ఖాతాలను ఆన్‌లైన్ చేయాలని కోరినప్పటికీ నేటి వరకు సమస్య పరిష్కారం కాలేదని, వెంటనే సమస్యను పరిష్కరించాలని, లేని పక్షంలో మే 15న జెడ్‌పి ఎదుట ధర్నా చేస్తానమి సిఇఒ దృష్టికి తెచ్చారు. సుదూర ప్రాంతాల్లో ఉండే ఉపాధ్యాయులు నేరుగా వచ్చే సౌకర్యం లేకపోవడం వల్ల ఉపాధ్యాయులు వ్యక్తిగతంగా వారి ఖాతా సమస్యలను జెడ్‌పి కార్యాలయం దృష్టికి తీసుకురావడం కోసం ఒక కాంటాక్ట్ ఫోన్‌నెంబరును కూడా ప్రకటించాలని కోరామని చెప్పారు. జెడ్‌పి సిఇఒ సానుకూలంగా స్పందించారు. వెంటనే ఆన్‌లైన్ చేస్తామని హామీ ఇచ్చారు. వినతిపత్రం అందించిన వారిలో జిల్లా కార్యదర్శులు హెచ్.అన్నాజీరావు, జి.సురేష్, బి.రవికుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వై.ఉమాశంకర్ పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదు

కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

ఫోన్‌లో సంపూర్ణ పోషకాహార నమోదును పరిశీలిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి - ఆమదాలవలస

అంగన్వాడీలు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ అన్నారు. గురువారం పట్టణంలోని ఐసిడిఎస్ కార్యాలయాన్ని సందర్శించి, రికార్డులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెక్టార్ పరిధిలో గర్భిణులు రక్తహీనతతో బాధపడుతున్న వారి సంఖ్య జిల్లాలో అట్టడుగు నుండి మూడవ స్థానంలో ఉందని తెలిపారు. ఎంతమందికైనా వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ అందిస్తోందని, యాప్‌లో నమోదు చేయాలని, అలా కాకుండా సాకులు చెబితే సహించేది లేదని సూపర్‌వైజర్‌ను హెచ్చరించారు. అంగన్వాడీలను ప్రక్షాళన చేయాలని ఐసిడిఎస్ పీడీ జయదేవికి సూచించారు. అనంతరం పట్టణంలోని 13వ వార్డులోని జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఉన్న అంగన్వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. గురువారం వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ ఎంతమందికి పంపిణీ చేశారని అంగన్వాడీ కార్యకర్తను ప్రశ్నించారు. రక్తహీన కలిగిన గర్భిణులు ఎందరు ఉన్నారని కలెక్టర్ ప్రశ్నించగా నలుగురు ఉన్నారని ఎఎన్ఎం బదులిచ్చారు.

ప్రాజెక్టు పరిధిలో 895 మంది గర్భిణులు ఉన్నారని, వారిలో 82 మంది గర్భిణులు రక్తహీనత కలిగి ఉన్నారని, వారిలో 66 మంది రక్తహీనతను అధిగమించినట్లు చరవాణిలో నమోదు చేశారని, మరో 16 మంది చరవాణిలో నమోదు కాబడలేదని పిఒ బాలామణి కలెక్టర్ దృష్టికి తెచ్చారు. అంగన్వాడీ కేంద్రం పరిధిలోని రక్తహీనత కలిగిన గర్భిణులు జొన్నవలస కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తీసుకు వెళ్తే వైద్యులు రక్తం ఎక్కించడం లేదని, గర్భిణికి మూడో నెలలో చేయాల్సిన పిపా స్కాన్ తీసుకొని రమ్మంటున్నారని స్కాన్ కోసం జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు తీసుకువెళ్తే అక్కడ పిపా స్కాన్ అందుబాటులో లేదని ఆశా కార్యకర్త కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన కలెక్టర్ వెంటనే రిమ్స్ మెడికల్ సూపరింటెండెంట్‌తో మాట్లాడి పిపా స్కాన్ రిమ్స్‌లో అందుబాటులో లేకపోవడానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ప్రైవేటు ల్యాబ్‌లలో గర్భిణులు స్కాన్ తీసుకుంటే ఆరోగ్యశ్రీ కింద వారి ఖాతాల్లో డబ్బులు జమవుతాయని తెలిపారు. డేటా ఎంట్రీ చేయడంలో కొన్ని లోపాలు ఉన్నాయని, వాటిని సరి చేస్తామని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఎస్.గణపతిరావు, మున్సిపల్ కమిషనర్ ఎం.రవిసుధాకర్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శిరీష, అంగన్వాడీ సూపర్‌వైజర్‌లు, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

చేనేత కార్మికుల అభ్యున్నతికి కృషి

చేనేత క్లస్టర్ ప్రారంభోత్సవంలో స్పీకర్ తమ్మినేని సీతారాం

చర్ఖాపై దారం తయారీని పరిశీలిస్తున్న స్పీకర్ సీతారాం

ప్రజాశక్తి- పొందూరు

చేనేత రంగాన్ని సంరక్షిస్తూ చేనేత కార్మికుల అభ్యున్నతికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆర్థికంగా, అండగా నిలుస్తున్నారని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలోని రాపాక కూడలిలో జెవిఆర్ కళ్యాణ మండపంలో గురువారం సాయిబాబా చేనేత సొసైటీ ద్వారా మంజూరైన రెండు చేనేత క్లస్టర్లను ఆయన ప్రారంభించారు. స్పీకర్ మాట్లాడుతూ దేశంలో వ్యవసాయరంగం తరువాత రెండో అతిపెద్ద రంగమైన చేనేతరంగం దేశ స్వాతంత్ర్య సాధనలో కీలక భూమిక పోషించిందన్నారు. దేశ వారసత్వ సంపద వైభవానికి అగ్రతాంబూలంగా నిలుస్తున్న చేనేత వస్త్రాలకు ఆదరణ ఎప్పటికీ శాశ్వతంగా నిలిచి ఉంటుందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా పొందూరు ఖాదీకి ఎంతో ప్రత్యేకత ఉందని, ఇది ఆమదాలవలస నియోజకవర్గంలో ఉండటం గర్వించదగ్గ విషయమని పేర్కొన్నారు. ఎందరో కార్మికులు కూలి గిట్టుబాటు కాక ఈ వృత్తిని వదిలి మరో వృత్తులకు వెళ్లేవారని, మరలా ఈ వృత్తికి పూర్వవైభవం తీసుకువచ్చేందుకు సిఎం నడుం బిగించారని అన్నారు. మగ్గం కలిగిన నేత కార్మికులకు నేతన్న నేస్తం కింద రూ.24వేలను ప్రభుత్వం ఇస్తోందన్నారు. ప్రస్తుతం నేత కార్మికులకు ఇస్తున్న ఈ పథకం వడుకు కార్మికులకు సైతం వర్తింపచేసేలా సిఎం దృష్టికి తీసుకెళ్తానన్నారు. కాలానుగుణంగా వస్త్రాల తయారీలో సాంకేతికతను జోడించి యువతను ఆకర్షించేలా వస్త్రాలను తయారు చేయాలని కార్మికులకు సూచించారు. క్లస్టర్-1 ద్వారా 243 మంది లబ్ధిదారులకు రూ.99.50లక్షలు, క్లస్టర్-2 ద్వారా 220 మంది లబ్ధిదారులకు రూ.105.48 లక్షల అందనున్నాయని అన్నారు. వీటి ద్వారా మగ్గం షెడ్ల నిర్మాణానికి 100శాతం సబ్సిడీతో 1.20 లక్షలు అందించనుండగా, మగ్గాలు ఇతర పరికరములు కొనుగోలుకు 90శాతం ప్రభుత్వం అందిస్తుండగా, 10 శాతం లబ్దిదారులు పెట్టుకోవాలని తెలిపారు. చేనేత, జౌళీ శాఖ ఎడి ధర్మారావు మాట్లాడుతూ క్లస్టర్ నిర్వాహణ ఒక సంవత్సరం పాటు ఉంటుందని, ఈ ఖర్చులు క్లస్టర్ నిధుల నుంచే వినియోగించనున్నట్లు చెప్పారు.

కార్యక్రమంలో ఎంపిపి కిల్లి ఉషారాణి, జెడ్‌పిటిసి లోలుగు కాంతారావు, వైసిపి మండల అధ్యక్షుడు పప్పల రమేష్‌కుమార్, పిఎసిఎస్ అధ్యక్షులు కె.రమణమూర్తి, ఎఎంసి చైర్మన్ బి.సునీల్‌కుమార్, వండాన వెంకటరావు, కాకర్ల రాజారావు, మేజర్ పంచాయతీ సర్పంచ్ రేగడి లక్ష్మి, బాడాన కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

చల్లని సమయంలో 'ఉపాధి' పనులు చేయాలి

ఉపాధి హామీ పనులు పరిశీలిస్తున్న డ్వామా పీడీ జివి.చిట్టిరాజు

ప్రజాశక్తి - పోలాకి

వేసవి ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున ఉపాధి హామీ పనులు చల్లని సమయంలో రెండు పూటలు నిర్వహించాలని డ్వామా పీడీ జి.వి చిట్టిరాజు సూచించారు. గురువారం కుసుమ పోలవలస పంచాయతీలో చేపడుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున ఉదయం 6.30గంటల నుండి 10గంటల వరకు, సాయంత్రం 3.30 నుండి 6గంటలు వరకు నిర్వహించాలన్నారు. పని చేసే స్థలాల్లో పరదాలు ఏర్పాటు చేయాలని సూచించారు. తాగునీరు అందుబాటులో ఉంచాలని సూచించారు. ప్రతి కూలీకి రూ.230లకు తక్కువ లేకుండా కూలి వచ్చేలా పనులు కల్పించాలని కోరారు. ప్రధానమంత్రి సురక్ష భీమా యోజన ఇన్సురెన్స్ స్కీంలో ప్రతి ఒక్కరినీ నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎపిఒ రమణ, ఇసి గోవిందరావు, క్షేత్ర సహాయకులు, తదితరులు పాల్గొన్నారు.

బాలల హక్కులు పరిరక్షణకు
సమన్వయంతో పనిచేయాలి

- బాల్య వివాహాలను అరికట్టాలి
- ఎపి బాలల రక్షణ హక్కుల కమిషన్ చైర్మన్ అప్పారావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

బాలల రక్షణ, హక్కులను పరిరక్షించడం అందరి బాధ్యతని, సమాజంలో అందరిలాగే చిన్నారులకు కొన్ని హక్కులు ఉంటాయని, అన్ని విభాగాల సమన్వయంతో బాలల హక్కుల పరిరక్షణకు కృషి చేయాలని ఎపి రాష్ట్ర బాలలు రక్షణ, హక్కులు కమిషన్ చైర్‌పర్సన్ డాక్టర్ కేసలి అప్పారావు పిలుపునిచ్చారు. జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో అప్పారావు మాట్లాడారు. గ్రామ స్థాయిలో బాల్య వివాహాలను అరికట్టాలన్నారు. బాలికల తల్లిదండ్రులకు చట్టాల గురించి అవగాహన కల్పిస్తూ బాల్య వివాహాలను అరికట్టాలన్నారు. బాలల హక్కుల పరిరక్షణకు జిల్లా ఎస్‌పి జి.ఆర్. రాధిక పర్యవేక్షణలో పోలీసులు పనితీరు రాష్ట్రంలోని మొదటి స్థానంలో ఉండటం సంతృప్తికరమని ఆయన తెలిపారు. మానవ అక్రమ రవాణా నిరోధక విభాగం ఈ ఏడాదిలో సుమారు 6230 విద్యార్థులకు బాలల హక్కులు, ముఖ్యమైన చట్టాలపై అవగాహన కల్పించారని తెలిపారు. రెస్క్యూ ఆపరేషన్‌లో పట్టుబడిన బాల, బాలికలను వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు పంపిణీ చేయాలన్నారు. గురుకుల పాఠశాలలు, వసతి గృహాల్లో ఉంటూ చదువుకుంటున్న విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందించి నైతిక విలువలతో కూడిన విద్యను అందించాలని తెలిపారు. విద్యార్థులు మాదకద్రవ్యాలకు బానిస కాకుండా తల్లిదండ్రులతో పాటు ఉపాధ్యాయులు, వసతిగృహ నిర్వాహకులు ప్రత్యేక దృష్టి సారించి, వారు బంగారు భవిష్యత్‌కు నాంది పలకాలని కోరారు. బాల కార్మికులు పనిచేసే స్థలాలను గుర్తించి ఆయా యాజమాన్యాలకు నోటీసులు ఇచ్చి, కేసులు నమోదు చేయాలని సూచించారు. బాలల రక్షణ కోసం పనిచేస్తున్న చైల్డ్‌వెల్ఫేర్ పోలీస్ అధికారులు ఎన్‌జిఒల సమన్వయంతో గ్రామాల్లో పర్యటించి చట్టాలపై సమీక్షలు నిర్వహించాలని సూచించారు. ఎఎస్‌పి టి.పి.విఠలేశ్వర్ మాట్లాడుతూ చిన్నారికి చేదోడు కార్యక్రమం జిల్లాలో సత్ఫలితాలు వస్తున్నాయని తెలిపారు. ఈ ఏడాది మార్చి వరకు 165 బాలబాలికలను రెస్క్యూ చేసి, వారి తల్లిదండ్రులకు అప్పగించామని చెప్పారు. బాల్య వివాహాలు అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ కషి చేయాలని కోరారు. ఎపి బాలల రక్షణ, హక్కుల కమిషన్ సభ్యులు జి.సీతారాం మాట్లాడుతూ జిల్లా మానవ అక్రమ రవాణా నిరోధ విభాగం సమర్థవంతంగా పని చేస్తోందన్నారు.

జిల్లాలో బాలివివాహాలు తగ్గుముఖం పెట్టినప్పటికీ కొన్ని ప్రాంతాల్లో అనాగరికత, అవగాహన లేకపోవడం వల్ల అక్కడక్కడా బాల్య వివాహాలు జరుగుతున్నాయని అన్నారు. చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ శ్రీలక్ష్మి మాట్లాడుతూ గత జనవరి నుంచి ఏప్రిల్ వరకు బాల కార్మికలు, మిస్సింగ్, బాల్య వివాహాలు, తదితర అంశాలపై 93 కేసులు నమోదు చేసుమన్నారు. ఇందులో 29 మందిని తల్లిదండ్రులకు అప్పగించామని, 24 మందిని వివిధ హోమ్స్‌లో ఉంచినట్లు చెప్పారు. ఈ సందర్భంగా చైల్డ్‌లైన్ ప్రచురించిన వాల్‌పోస్టర్‌ను కమిషన్ చైర్మన్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో డిసిపిఒ కె.వి రమణ, డిఎస్‌పి ఎస్.వాసుదేవ్, కృష్ణమోహన్, సిఐ బి.ప్రసాద్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

మే 28కి స్టోన్ ప్లాంటేషన్ పూర్తి



కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జెసి నవీన్

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్

రాష్ట్ర వ్యాప్తంగా మే 28వ తేదీ నాటికి స్టోన్ ప్లాంటేషన్ పనులు పూర్తి చేయాలని భూ పరిపాలన ప్రధాన కమిషనర్ జి.సాయిప్రసాద్ ఆదేశించారు. గురువారం రెండో విడత రీసర్వే, స్టోన్ ప్లాంటేషన్ పనులపై ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రీ సర్వే పూర్తయిన గ్రామాలకు సంబంధించి భూ హక్కు పత్రాలను సిద్ధం చేయాలని, భూహక్కు పత్రాలలో ఎటువంటి తప్పులకు తావులేకుండా పరిశీలించాలన్నారు. హక్కు పత్రాల్లో భూ యజమాని ఫోటోలు లేకుంటే అటువంటి వివరాలను తమకు సమర్పించాలని ఆదేశించారు. సర్వే పూర్తయిన భూములకు సంబంధించిన మ్యాప్‌లను ప్రచురణ కోసం సర్వే శాఖకు పంపించాలని సూచించారు. ప్రచురణ పూర్తయిన తర్వాత భూహక్కు పత్రాలను భూయజమానులకు పంపిణీ చేసి, కార్యక్రమాన్ని పూర్తిచేయాలన్నారు. ఈ పనులు మే 28 నాటికి పూర్తిచేసేలా ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. వీటితో పాటు గ్రామాల్లో చేపడుతున్న స్టోన్ ప్లాంటేషన్ పనులు మరింత వేగవంతం చేసి సకాలంలో పూర్తి చేయాలని తెలిపారు. రీ సర్వేకు సంబంధించి మ్యూటేషన్లు, ప్లాంటేషన్, తదితర అంశాలపై రోజువారీ నివేదికలు తెప్పించుకోవాలని, వాటిని తమకు సమర్పించాలన్నారు. అనంతరం స్పందనపై సమీక్షిస్తూ స్పందనలో వచ్చిన వనతులను సకాలంలో పరిష్కరించాలని, పరిష్కారంపై ప్రతి రోజూ సమీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. సమావేశంలో సంయుక్త కలెక్టర్ ఎం.నవీన్, సర్వే, భూ రికార్డుల సహాయ సంచాలకులు కె.ప్రభాకరరావు, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

యుబి పరిశ్రమను ముట్టడించిన కార్మికులు

(మెయిన్ పేజీలో)

నోటీసు
మహారాజశ్రీ సీనియర్ సివిల్ జడ్జి పిఠాపురంవారి కోర్టులో
F.D.I.A. 11/2022
in O.S. 79/1987
Between:
బస అప్పారావు (Died) అండ్ అదర్స్ ...పిటీషనర్స్
మరియు
బస సత్తిరాజు (Died) అండ్ అదర్స్ ...రెస్పాండెంట్స్
రెస్పాండెంట్:
R13 : వీరపల్లి నాగ వరలక్ష్మి @ బస నాగ వరలక్ష్మి D/o. (Late) లక్ష్మణరావు, W/o. రవిశంకర్, హిందూ, వయస్సు 45 సం॥లు, గృహిణి, శ్రీకాకుళం, శ్రీకాకుళం మండలం, శ్రీకాకుళం జూనియర్ సివిల్ జడ్జి కోర్టు లిమిట్స్
పై నెంబరు గల ఫైనల్ డిక్రీ పిటీషన్‌లో మీకు శ్రీ కోర్టువారు ఎన్నిపర్యాయములు నోటీసులు పంపించినప్పటికీ మీరు ఉద్దేశ్యపూర్వకంగా తీసుకోకుండా కాలయాపన చేయుచున్నందున పై నెంబరు గల పిటీషన్ **ది. 03-05-2023వ తేదీన** వాయిదా అయి ఉన్నది. కావున ఆరోజున **ఉదయం గం. 10-30 ని॥లకు** మీరు స్వయంగా గానీ లేదా మీ ప్లీడరు గారి ద్వారా గానీ కోర్టుకు హాజరు అయ్యి మీ అక్షేపణలు తెలియజేయవలెను. లేని యెడల పై పిటీషన్‌లో మీకు పరోక్షమున తీర్మానించబడునని తెలియజేయడమైనది.
|| ఇది శ్రీ కోర్టువారి ఆర్డరు ప్రకారం జారీచేయబడిన నోటీసు ||
పి.వి.ఎస్.ఆర్. మూర్తి, అడ్వకేట్
పిఠాపురం. డో.నెం. 4-2-133, కుచివారి వీధి,
ది.27-4-2023 పిఠాపురం. సెల్: 9848006149

సమీక్షిస్తున్న వెంకటరావు

మత్తు పదార్థాల రవాణాను అరికట్టాలి

ప్రజాశక్తి- ఆమదాలవలస

గంజాయి, ఇతర మత్తు పదార్థాలు రైళ్లలో అక్రమ రవాణా జరగకుండా అరికట్టాలని విశాఖపట్నం లైన్స్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.వెంకటరావు జిఆర్‌పి పోలీసులకు ఆదేశించారు. శ్రీకాకుళం రోడ్డు రైల్వేస్టేషన్‌లోని జిఆర్‌పి పోలీస్ స్టేషన్‌ను గురువారం సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిఆర్‌పిఆర్‌పిఎఫ్ పోలీసులు ఉమ్మడిగా కలిసి నేరాలను అరికట్టాలన్నారు. వేసవి కాలం సందర్భంగా ప్లాట్ ఫామ్ బిట్స్, ట్రైన్ బిట్స్‌లో సిబ్బందిని నియమించి నేరాలను అరికట్టాలని ఆదేశించారు. రైల్వేస్టేషన్ స్టాల్స్‌లో పనిచేసే సిబ్బంది కూలీల దగ్గర నుంచి సమాచారాన్ని సేకరించి నేరాలపై దృష్టి పెట్టాలని సూచించారు. మాదకద్రవ్యాలు, బంగారం తదితర అక్రమ రవాణాపై దృష్టి సారించి నిందితులను పట్టుకొని కేసులు నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. రైలు మెట్లపై ప్రయాణికులు కూర్చోకుండా వారికి అవగాహన కల్పించాలన్నారు. ప్రయాణికులు మాస్కులు ధరించేలా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిఆర్‌పి సిబ్బంది పాల్గొన్నారు.

పెన్షనర్లను పరామర్శిస్తున్న నాయకులు

పెన్షనర్లకు జెఎసి నేతల పరామర్శ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రాష్ట్రవ్యాప్తంగా కొన్ని రోజులుగా దశల వారీ ఆందోళన చేస్తున్న అమరావతి జెఎసి ఉద్యమ కార్యాచరణలో భాగంగా గురువారం పెన్షనర్ల ఇళ్లకు వెళ్లారు. నగరంలోని పిఎస్ఎన్ఎం స్కూల్ సమీపాన నివాస ముంటున్న పలువురు పెన్షనర్ల ఇళ్లకు వెళ్లి పరామర్శించి వారి ఆర్థిక ఇబ్బందులపై చర్చించారు. ప్రభుత్వ ఉద్యోగులకు, పెన్షనర్లకు సకాలంలో వేతనాలు చెల్లించకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోయారు. పెన్షన్లు సకాలంలో అందక అనారోగ్య సమస్యలు, ఇతర సమస్యలతో సతమతమవుతున్నారని అన్నారు. సకాలంలో వేతనాలు, పెన్షన్ చెల్లింపులు చేపట్టాలని ప్రభుత్వానికి నాయకులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అమరావతి జెఎసి జిల్లా చైర్మన్ కె.శ్రీరాములు, జిల్లా అసోసియేట్ చైర్మన్ పి.లక్ష్మణరావు, రెవెన్యూ సర్వీసుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.వేణుగోపాలరావు, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ పి.శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి బి.వి.వి.ఎన్.రాజు, ట్రెజరర్ జి.ఎల్.ఈ.శ్రీనివాసరావు, సచివాలయం ఉద్యోగుల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.గోవిందరావు, మురళి, విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు ఎం.కాళీప్రసాద్ పాల్గొన్నారు.

పెచ్చుమీరుతున్న మతోన్మాద దాడులు

శ్రీకాకుళం అర్బన్ : ప్రచారం చేస్తున్న వామపక్ష నాయకులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

దేశంలో మైనార్టీలపై మతోన్మాద దాడులు పెరిగిపోతున్నాయని, ఈ దాడులు ఆపకపోతే దేశవ్యాప్త ప్రతిఘటన తప్పదని సిపిఐ జిల్లా కార్యదర్శి బి.శ్రీరామ్మూర్తి, సిపిఎం నగర కన్వీనర్ టి.తిరుపతిరావులు కేంద్ర ప్రభుత్వానికి హెచ్చరించారు. దేశవ్యాప్త ప్రచార భేరిలో భాగంగా 14వ రోజు గురువారం నగరంలో జెండాలవీధి, దుంపల రెల్లివీధి, గూనపాలెం చెరువు గట్టు, అబ్దుల్ కలామ్ నగర్ తదితర ప్రాంతాల్లో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రధాన మోడీ ఫాసిస్ట్ మతోన్మాద విధానాలు పక్కన పెట్టి దేశాభివృద్ధికి కృషి చేయాలన్నారు. మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత ముస్లిములు, క్రిస్టయన్లపై దాడులు పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజావ్యతిరేక, నిరంకుశ, మతోన్మాద బిజెపికి ప్రజలు తరిమికొట్టిన రోజులు దగ్గర పడ్డాయన్నారు. మైనారిటీలతో కలిసి ఉద్యమాలను నిర్మిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఐ నగర కార్యదర్శి డోల శంకరరావు, సిపిఎం నాయకులు ఎ.సోమశేఖర్, పి.ప్రభావతి, బి.రామారావు, పి.కామినాయుడు, పి.ప్రసాద్ పాల్గొన్నారు.

పలాస : ప్రజలపై భారాలు వేస్తున్న కేంద్ర ప్రభుత్వాన్ని సాగనంపాలని సిపిఎం మండల కార్యదర్శి ఎన్.గణపతి పిలుపునిచ్చారు. ప్రచార భేరీ కార్యక్రమంలో 20వ వార్డు సూదికొండ కాలనీలో ప్రచారం చేపట్టారు. ప్రచార కార్యక్రమంలో భాగంగా ఈ నెల 29న కాశీబుగ్గ పాత బస్టాండ్ వద్ద గల సంత మైదానంలో బహిరంగ నిర్వహిస్తున్నామని, దీనిని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎ.వీరాస్వామి, ఎం.నిర్మల, ఎం.పరశురాం పాల్గొన్నారు.

పలాస : పోస్టర్లను అందజేస్తున్న నాయకులు

మేడేను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి- ఆమదాలవలస

కార్మికుల హక్కుల దినోత్సవం మేడేను విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కె.నాగమణి కార్మికులకు పిలుపునిచ్చారు. మార్కెట్ కమిటీ యార్డులో కార్మిక సంఘ నాయకులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 1986 మే నెలలో చికాగో నగరంలో 8 గంటల పనిదినం కోసం జరిగిన కార్మిక పోరాటమే మేడేగా అవతరించిందని తెలిపారు. ఆ తరువాత కాలంలో ప్రపంచంలోని అన్ని దేశాల్లో కార్మిక వర్గం ఎనిమిది గంటల పని దినాలను సాధించడం జరిగిందని తెలిపారు. మేడే ఒక రోజుకే పరిమితం కాకుండా వారోత్సవాలుగా జరగాలని, జెండా ఆవిష్కరణలు, ఊరేగింపులు, సభలు, సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ప్రయివేటీకరణ, సరళీకరణ విధానాలు తీవ్రమవుతున్న నేపథ్యంలో పోరాడి సాధించుకున్న హక్కులపై దాడులు జరుగుతున్నాయని అన్నారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి పంచాది లతాదేవి, మున్సిపల్ వర్కర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు తాడి సంతోష్, జె.శ్రీనివాసరావు, విఆర్ఎ సంఘ నాయకులు కె.రమణ, ఆశా వర్కర్ సంఘ అధ్యక్షులు యారబాటి భవాని, రాజ్యలక్ష్మి, నిర్మల, వ్యవసాయ కళాక్షేత్రం కాంట్రాక్టు వర్కర్స్ నాయకుడు చిట్టిబాబు, టైంస్కేల్ నాయకుడు రమణ పాల్గొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాగమణి

నేడు కొత్తూరులో ర్యాలీ

కొత్తూరు : మండల కేంద్రం కొత్తూరులో శుక్రవారం ఉదయం 10 గంటలకు సిపిఎం, సిపిఐ ప్రచార భేరీ కార్యక్రమంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసిస్తూ ర్యాలీ నిర్వహిస్తున్నామని సిపిఎం జిల్లా నాయకులు సిర్ల ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ర్యాలీలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.తులసీదాసు, జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు పాల్గొంటారని అన్నారు. మండలంలోని ప్రజలు, కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

రవిబాబుకు డాక్టరేట్

రవిబాబు

పొందూరు : మండలంలోని రాపాకకు చెందిన కొంచాడ రవిబాబుకు డాక్టరేట్ లభించింది. రవిబాబు రాజాం జిఎం ఆర్ఐటిలో గణిత సహాయ ఆచార్యుడిగా పనిచేస్తున్నారు. రవిబాబుకు కాకినాడలోని జెఎన్‌టియు విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్ ప్రకటించింది. ఈయన గణితంలో 'సమ్ ఫిక్స్‌డ్ పాయింట్ కంట్రిబ్యూషన్స్ ఆన్ ఎబి మెట్రిక్ స్పేసెస్ అండ్ పార్షియల్ ఆర్డర్ మెట్రిక్ స్పేసెస్' అనే అంశంపై చేసిన పరిశోధనకు డాక్టరేట్ వచ్చింది. ఈ పరిశోధనకు ఆంధ్రా విశ్వవిద్యాలయానికి చెందిన డాక్టర్ సిహెచ్.శ్రీనివాసరావు, పాలకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన డాక్టర్ సిహెచ్.రాఘ వేంద్రనాయుడులు పర్యవేక్షించారు. డాక్టరేట్ లభించడంపై జిఎంఆర్ఐటి కళాశాల ప్రిన్సిపాల్ సి.ఎల్.వి.ఆర్.ఎస్.వి.ప్రసాద్, అధ్యాపక బృందం హర్షం వ్యక్తం చేశారు.

బిసి కాలనీలో అన్నదానం

నందిగాం : నందిగాం బిసి కాలనీలోని షిర్డీ సాయిబాబా నాలుగో వార్షికోత్సవ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పరిసర గ్రామాల నుంచి యాత్రికులు పాల్గొన్నారు. కార్యక్రమంలో మేడేపల్లి రమేష్‌శర్మ, రేజోటి బోసుబాబు, బి.మల్లేశ్వరరావు, ఆదినారాయణ పాల్గొన్నారు.

విద్యతో సమానంగా క్రీడలకు ప్రోత్సాహం

క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న జగదీశ్వరరావు

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

విద్యార్థులు చదవుతో పాటు క్రీడల్లో గుర్తింపు తెచ్చుకునేందుకు ప్రోత్సహిస్తున్నామని ట్రిపుల్ ఐటి డైరెక్టర ప్రొఫెసర్ జగదీశ్వరరావు అన్నారు. ఎచ్చెర్ల ట్రిబుల్ ఐటిలో మూడు రోజుల ఇంటర్ క్యాంపస్ స్పోర్ట్స్ టోర్నమెంట్‌ను గురువారం ప్రారంభించారు. విద్యార్థులు సంక్షేమ విభాగం, ఫిజికల్ ఎడ్యుకేషన్ సంయుక్తంగా ఈ పోటీలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ పోటీల్లో క్రికెట్, వాలీబాల్, కబడ్డీ క్రీడలు ఉన్నాయని అన్నారు. బాలురు విభాగం నుంచి 9 క్రికెట్, 7 కబడ్డీ, 7 వాలీబాల్ జట్లు పాల్గొంటున్నాయని, బాలికల విబాగం నుంచి 7 వాలీబాల్, 7 కబడ్డీ జట్లు క్యాంపస్ టోర్నీలో పాల్గొంటున్నారని అన్నారు. ట్రిపుల్ ఐటిలో చదువుతున్న విద్యార్థుల్లో మానసిక ఒత్తిడి లేకుండా చదువకునేందుకు వీలుగా క్రీడలను ప్రోత్సాహిస్తున్నట్టు తెలిపారు. ఈ పోటీల్లో ఒఎస్‌డి ప్రొఫసర్ సుధాకర్‌బాబు, పరిపాలన అధికారి ముని రామకృష్ణ, డీన్ మోహన్ కృష్ణ, గేదెల రవి, ఫైనాన్స్ ఆఫీసర్ ఆసిరినాయుడు, ఫిజికల్ విభాగం దిలీప్, కృష్ణంరాజు పాల్గొన్నారు.

పరామర్శిస్తున్న గౌతు శిరీష

గౌతు శిరీష పరామర్శ

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

మండలంలోని టిడిపి కుటుంబ సభ్యులకు ప్రధాన కార్యదర్శి పలాస నియోజకవర్గ ఇన్‌ఛార్జి గౌతు శిరీష గురువారం కలిశారు. తుంబనివానిపేటలో ఇటీవల వివాహమైన నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మాజీ ఎంపిపి వసంతస్వామిని కలుసుకొని ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఉద్దానం రామకృష్ణాపురానికి చెందిన చింత నారాయణ ప్రమాదవశాత్తు గాయపడిన విషయం తెలుసుకొని ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కొమరల్తాడ ఇటీవల మృతి చెందిన వెంకటరమణ కుటుంబ సభ్యులను పరామర్శించారు. రెయ్యపాడుకు చెందిన మదనాల రామమూర్తి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆమెతో పాటు మండల పార్టీ అధ్యక్షుడు మోహనరావు, ప్రధాన కార్యదర్శి రమణ, ఈశ్వరరావు, మద్దిలి చిన్నయ్య, చిట్టిబాబు, ఉమామహేశ్వరరావు, శషిభూషణ్, దుర్యోధన, బాలకృష్ణ, దానయ్య ఉన్నారు.

వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ మల్లేశ్వరమ్మ

రోగులకు వైద్య పరీక్షలు

పొందూరు: మండలంలోని రాపాక హెల్త్‌వెల్‌నెస్ కేంద్రం-1లో గురువారం ప్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారిని మల్లీశ్వరమ్మ వృద్ధులకు, గర్భిణులకు, బాలింతలకు, చిన్నారులకు, మంచం పట్టిన రోగులకు వైద్య పరీక్షలను జరిపి మందులను అందజేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పిలు లావణ్య, జ్యోత్స్న, ఎఎన్ఎం ఉదయ్, హెల్త్ అసిస్టెంట్ రమణ, ఆశా కార్యకర్త రాజేశ్వరి, లక్ష్మి, ఉష, పుణ్యావతి పాల్గొన్నారు.

చుక్కల మందు వేస్తున్న సభ్యులు

చుక్కల మందు పంపిణీ

ప్రజాశక్తి- నౌపడ

వికాస తరంగని ద్వారా దీర్ఘాయువు ఆయుర్వేద కేంద్రం ఆధ్వర్యాన నౌపడ ప్రాథమిక పాఠశాల, సీతానగరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వికాస తరంగిణి సభ్యులు స్వర్ణామృత ప్రాశన చుక్కల మందులను వేశారు. దీనిని సర్పంచ్ పిలక బృందావతి, రవికుమార్‌రెడ్డి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ 16 ఏళ్లలోపు పిల్లలకు ఈ ఆయుర్వేధ ఔషధం వేయడం వల్ల జ్ఞాపకశక్తి పెంపొందుతుందన్నారు. అలాగే రోగ నిరోధకశక్తి పెంపొందుతుందన్నారు. కార్యక్రమంలో వికాస తరగిణి సభ్యులు పి.రవికుమార్‌రెడ్డి, వి.వాసుదేవరావు, బి.సోమశ్వరరావు, ఎన్.తిరుపతిరెడ్డి, హెచ్ఎం అప్పలరాజు, మధు, విద్య కమిటీ చైర్మన్ లింగరాజు, బాబ్జీ పాల్గొన్నారు.

పాడి పరిశ్రమ విస్తరణకు కృషి

టెక్కలి : పాడిపరిశ్రమ విస్తరించాలని టెక్కలి పశు సంవర్ధకశాఖ అధికారి డాక్టర్ కె.జె.చక్రవర్తి అన్నారు. టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యాన మోదుగువలసలో గురువారం జాతీయ సేవా శిబిరాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మాట్లాడుతూ పాడి పరిశ్రమ వల్ల కలుగుతున్న లాభాలను వివరిస్తూ భవిష్యత్‌లో వీటిని కాపాడాల్సిన అవసరం ఉందన్నారు. ఇందులో భాగంగా పశువులు పెంపకానికి తీసుకోవాల్సిన అంశాలను వివరించారు. కార్యక్రమంలో జాతీయ సేవా విభాగం పిఒ వి.లూక్‌పాల్, అధ్యాపకులు బేపల సతీష్‌కుమార్, కె.గొల్ల పాల్గొన్నారు.

వైసిపి కౌన్సిలర్‌పై దాడి

ఇచ్ఛాపురం : మున్సిపాలిటీ తొమ్మిదో వార్డు కౌన్సిలర్ బచ్చు జగన్‌పై తండ్రీకొడుకులు దాడి చేసి గాయపరిచారని క్షతగాత్రుడు గురువారం పోలీసులకు ఫిర్యాదుచేశారు. గోర్జీ వీధిలో ఉన్న నిమ్మన ముత్యాలు కొడుకులతో తగాదాపడి 18 రోజులుగా ఇంటి బయట ఉంచారు. దీంతో వృద్ధురాలు అక్కడే నిద్రించి కాలకృత్యాలు తీసుకుంటూ ఉంది. ఇది చూసి చలించిన వార్డు కౌన్సిలర్ జగన్ కలుగజేసుకొని వృద్ధురాలికి మద్ధతుగా నిలిచాడు. దీంతో ఆగ్రహించిన ఎన్.హెడంబరరావు, అతని కుమారుడు రాము కలిసి తనపై డాడి చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. వృద్ధురాలిని రోడ్డు బయట నిలబెట్టడం దారుణమని అన్నారు.

పూరిల్లు దగ్ధం

ప్రజాశక్తి- జి.సిగడాం

దగ్ధమవుతున్న ఇల్లు

మండలంలోని శేతుభీమవరంలో గురువారం బోల్లు నారాయణరావు పూరిల్లు దగ్ధమైంది. ఉదయం ఇంట్లో దీపం పెట్టి ఉపాధి పనికి వెళ్లిపోయారు. దీపం పరదాకు అంటుకొని ఇల్లు దగ్ధమైంది. వెంటనే గ్రామస్తులు మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో రూ.3 లక్షల నగదు, తులం బంగారం ఆభరణాలు, ఆహార ధాన్యాలు, రికార్డులు, ఆధార్ కార్డులు, రేషన్ కార్డు, దుస్తులు, విద్యుత్ మీటరు కాలిపోయింది. సమాచారం అందుకున్న రణస్థలం అగ్నిమాపక సిబ్బంది శకటంతో వచ్చి మంటలను అదుపు చేశారు. విషయం తెలుసుకున్న తహశీల్దార్ పప్పల వేణుగోపాలరావు పరిశీలించి బాధితుడికి 10 బియ్యం బస్తాలు, వంట నూనె, నిత్యావసర వస్తువులు అందజేయాలని అధికారులకు ఆదేశించారు. ఆర్ఐ రామచంద్రరావు, విఆర్ఒ రఘు, కార్యదర్శి వై.హరిబాబు బాధితులకు సరుకులను అందజేశారు. సర్పంచ్ తొత్తడి రామారావు, ఎంపిటిసి కుదిరిల్ల గోవిందారావు బాధితుడికి తక్షణ సాయం కింద నగదు అందజేశారు.

పట్టుదలతో శ్రమిస్తే ఏదైనా సాధించగలం

కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న కలెక్టర్, తదితరులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ప్రతి వ్యక్తీ పట్టుదలతో శ్రమిస్తే సాధించలేనిది ఉండదని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ అన్నారు. కలెక్టరేట్‌లో భగీరథ మహర్షి జయంతి వేడుకలు గురువారం నిర్వహించారు. ముందుగా భగీరథ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మరుగునపడిన చరిత్రకారుల జీవితాలను, మహనీయుల గొప్పతనాన్ని వెలికితీసి వారి ఆదర్శ భావాలకు అనుగుణంగా ప్రభుత్వం అధికారిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో బిసి సంక్షేమశాఖ సలహాదారు మూల నారాయణరావు, జిల్లా బిసి సంక్షేమశాఖ అధికారి ఇ.అనురాధ, బిసి కార్పొరేషన్ ఇడి ఆర్.గడ్డెమ్మ, బిసి సంక్షేమశాఖ జాతీయ కార్యదర్శి డాక్టర్ బి.దేవభూషణరావు, ఉప్పర సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు వెంకట రామారావు, ఆనలుగురు స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి విజయ లక్ష్మి పాల్గొన్నారు.

బ్రిజ్ భూషణ్‌సింగ్‌ను అరెస్టు చేయాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

మహిళా రెజ్లర్ల క్రీడాకారులపై లైంగిక వేధింపులకు పాల్పడిన బిజెపి ఎంపీ బ్రిజ్ భూషణ్ సింగ్‌పై ఫోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని శ్రామిక మహిళా సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ కె.నాగమణి డిమాండ్ చేశారు. నగరంలోని యుటిఎఫ్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతూ గురువారం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలో రెజ్లింగ్ క్రీడల్లో, ఒలింపిక్ మెడల్స్ సంపాదించి దేశ ప్రతిష్టను దేశ, విదేశాల్లో సత్తా చాటుతున్నారన్నారు. వారిపై లైంగిక దాడులకు దిగుతూ, అవమానపరుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

బిజెపి ఎంపీ అత్యాచార కేసు నమోదు చేసి తమకు న్యాయం చేయాలని వారి గోడును ప్రధాని, కేంద్ర మంత్రులు పట్టించుకోక పోవడం కుటిల నీతికి అద్ధం పడుతోందన్నారు. పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదునూ ఖాతరు చేయడం లేదని దుయ్యబట్టారు. అరెస్టు చేయని పక్షంలో దేశవ్యాప్తంగా ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కె.సూరయ్య, వి.జి.కె.మూర్తి, ఆర్.మధుసూదనరావు, కె.అప్పారావు, పి.త్రినాథరావు, ఆర్.ప్రకాష్, కె.శ్రీణివాసు, రాజు, పద్మ పాల్గొన్నారు.

రికవరీలు కడితేనే కాంట్రాక్టు రెన్యువల్

జిల్లా నిఘా విభాగం అధికారి లవరాజు

మాట్లాడుతున్న లవరాజు

కోటబొమ్మాళి: ఉపాధి హామీలో భాగంగా మండలంలో 38 పంచాయతీల్లో నిర్వహించిన పనులపై 14 విడతల సామాజిక తనిఖీల్లో వచ్చిన రికవరీలను వెంటనే కట్టాలని, లేకుంటే సంబంధిత సాంకేతిక, క్షేత్ర సహాయకుల కాంట్రాక్టు రెన్యువల్ నిలిపివేస్తామని జిల్లా నిఘా విభాగం అధికారి బి.లవరాజు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం సమావేశం మందిరంలో సాంకేతిక, క్షేత్ర సహాయకులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సంద ర్భంగా మాట్లాడుతూ మండలంలోని 38 పంచాయతీల్లో ఇప్పటి వరకు 14 రౌండ్లు నిర్వహించిన సామాజిక తనిఖీల్లో రికవరీలు వచ్చిన సాంకేతిక సహాయకులు, క్షేత్ర సహాయకులు వెంటనే కట్టాలని, లేకుంటే వారి కాంట్రాక్టు రెన్యుల్‌ను నిలిపివేస్తామని హెచ్చరించారు. రికవరీకి సంబంధించి రూ.15 లక్షల బకాయి ఉన్నాయని, దీనిని రికవరీకి నోటీసులు జారీ చేయాలని ఎంపిడిఒ కె.నిర్మలకు సూచించారు. కార్యక్రమంలో ఎపిడి బి.మురళీకృష్ణ, జిల్లా సహాయ నిఘా విభాగం అధికారి సురేష్, ఎపిఒ అరుణ్ కుమార్, క్లస్టర్ టిఎ జి.హరిప్రసాద్ పాల్గొన్నారు.

మెరిసిన 'బిఎస్‌జెఆర్'

టెక్కలి : ఇంటర్ ఫలితాల్లో టెక్కలి బిఎస్‌జెఆర్ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ సాధించారని కరస్పాండెంట్ కోత మురళీధర్, ప్రిన్సిపాల్ కోత శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో బైపిసి గ్రూపుకు చెందిన ఎం.సుమలత 979 మార్కులు సాధించారన్నారు. 12 మంది ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 900కు పైగా మార్కులు సాధించారని తెలిపారు. ప్రథమ సంవత్సరం ఫలితాల్లో 25 మంది విద్యార్థులకు పైగా 400 మార్కులు సాధించి ప్రతిభ కనబరిచారని అన్నారు. ప్రతిభ సాధించిన విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

'కాకినాడ ఆదిత్య' విజయభేరి

శ్రీకాకుళం అర్బన్ : ఇంటర్మీడియట్ బోర్డు విడుదల చేసిన ఫలితాల్లో నగరంలోని కాకినాడ ఆదిత్య జూనియర్ కళాశాల విద్యార్థులు విజయ భేరి మోగించారు. ప్రథమ సంవత్సరం ఫలితాల్లో ఎంపిసి నుంచి పెద్దిన శరణ్య, భమిడిపాటి స్వర్ణశ్రీలు 464 మార్కులు సాధించారు. 463 మార్కులతో బండి కీర్తి, 462 మార్కులతో పి.ప్రవీణ్‌కుమార్, 461మార్కులతో చింతాడ దివ్యశ్రీ నిలిచారు. అలాగే బైపిసి నుంచి అంపోలు దీవెన 425 మార్కులు రాగా, పి.వరం 424, మడ్డి జ్యోతి 423, గొల్లంగి మాలతి, దీక్షిత దత్త 413 మార్కులు సాధించారు. అలాగే ద్వితీయ ఇంటర్ నుంచి ఎంపిసిలో కుప్పిలి శ్రీవైష్ణవి 978 మార్కులు, బైపిసి నుంచి 972 మార్కులతో బిర్లంగి చాందిని అత్యుత్తమ ఫలితాలు సాధించారు. వారిని ప్రిన్సిపాల్ ఎం.ఢిల్లీశ్వరరావు, డైరెక్టర్ దీపక్ రెడ్డిలు అభినందించారు.

అభినందిస్తున్న కాకినాడ ఆదిత్య యాజమాన్యం

'కళ్యాణి' విద్యార్థుల సత్తా

కవిటి: సన్‌రైజ్ గ్రూప్ ఆధ్వర్యాన నడుస్తున్న స్థానిక కళ్యాణి జూనియర్ కళాశాల బుధవారం విడుదలైన ఇంటర్మీడియట్ ఫలితాల్లో అద్భుత ఫలితాలతో సత్తాచాటింది. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఎంపిసిలో తిమ్మ కీర్తి(462) మార్కులతో నియోజకవర్గ స్థాయిలో ప్రథమ స్థానంలో నిలవగా, బైపిసిలో ఆవాల నీలవేణి (419) మార్కులతో మండల స్థాయిలో ప్రథమ స్థానాన్ని దక్కించుకుంది. ద్వితీయ సంవత్సరం ఎంపిసిలో గుడియా కౌశిక్ (978), బైపిసిలో కర్రి జ్యోతిశ్రీ (963) మార్కులతో మండల స్థాయిలో ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యాపక బృందం మాట్లాడుతూ తమ కళాశాలలో ప్రథమ సంవత్సరంలో 400కి పైబడి 19 మంది, ద్వితీయ సంవత్సరంలో 900కు పైబడి 12మంది విద్యార్థులు మార్కులు సాధించినట్టు తెలిపారు. అనంతరం విద్యార్థులను ఘనంగా సన్మానించారు.

కీర్తిని అభినందిస్తున్న అధ్యాపకులు

'విశ్వజ్యోతి విద్యార్థుల ప్రతిభ

టెక్కలి : పట్టణంలోని విశ్వజ్యోతి జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థులు ఇంటర్ పరీక్షా ఫలితాల్లో ప్రతిభ కనబరిచారని ప్రిన్సిపాల్ ఎం.మోహన్‌కుమార్, ఆకడమిక్ సలహాదారులు దుప్పల రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రథమ సంవత్సరంలో నెల్లిపర్తి భరత్‌కుమార్ 470కు గాను 464 మార్కులు సాధించి పట్టణంలోనే ప్రథమస్థానంలో నిలిచారని తెలిపారు. ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో అన్నెపు నవీన్‌కుమార్ 982 మార్కులు సాధించారని తెలిపారు.

సమస్యలు పరిష్కరించకుంటే రాజీనామా

వైసిపి ఎంపిటిసి చక్రవర్తి

మాట్లాడుతున్న ఎంపిపి పుష్ప

ఇచ్ఛాపురం: ప్రతి మండల సమావేశంలోనూ సమస్యలు ప్రస్తావిస్తున్నానని, ఒక్క సమస్యా పరిష్కారం కావడం లేదని, వచ్చే సమావేశానికి సమస్యలు పరిష్కరించకుంటే తన పదవికి రాజీనామా చేస్తానని కేసుపురం ఎంపిటిసి మాసుపత్రి చక్రవరి స్పష్టం చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి బోర పుష్ప అధ్యక్షతన గురువారం మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత కొంతకాలంగా సమావేశంలో అనేక అంశాలను అధికారులు దృష్టికి తీసుకొచ్చినా ఒక్కటీ ఇప్పటి వరకు పరిష్కరించలేదని అన్నారు. సమస్యలు పరిష్కరించకుంటే సమావేశాలకు ఎందుకు రావాలని ప్రశ్నిస్తూ... అధికారుల తీరుపై మండిపడ్డారు. రేషన్ సరుకుల పంపిణీ, నీటి పారుదల శాఖ, విద్యాశాఖకు చెందిన పలు అంశాలపై మండల సమావేశంలో ప్రస్తావించినా పరిష్కారం కాలేదని అన్నారు. గ్రామాల్లో ప్రజలు అడుగుతుంటే సమాధానం చెప్పలేకపోతున్నామని అన్నారు. ఎంఇఒ అప్పారావు మాట్లాడుతూ వేసవకాలంలోనే విద్యాశాఖ చేపట్టిన వేసవి శిక్షణా తరగతులు గురుంచి వివరించారు. మనబడి కార్యక్రమంలో పాఠశాలల ఎంపిక తమ చేతుల్లో లేదని వివరించారు. మొత్తం స్కూల్ ఎడ్యుకేషన్ ఆఫ్ ద్వారా నేరుగా ఎంపిక అవుతుందని అన్నారు. ఉపాధి హామీ పనులకు కొత్త జాబ్‌కార్డులు ఎందు ఇవ్వడం లేదని మాజీ ఎంపిపి, బిర్లంగ్ ఎంపిటిసి దక్కత ఏకంబరీదేవి అధికారులను నిలదీశారు. ఉపాధి పనుల్లో పలు అవకతవకలు జరుగుతున్నాయని, ఒకరికి బదులు మరొకరు పనులకు వస్తున్నారని సభ దృష్టికి తీసుకొచ్చారు. సమావేశంలో జెడ్‌పిటిసి ఉప్పాడ నారాయణమ్మ, ఎంపిడిఒ రామారావు తదతరులు పాల్గొన్నారు.

లేగదూడల ప్రదర్శన

మెళియాపుట్టి : మండలంలో పెద్దలక్ష్మీపురంలో గురువారం లేగదూడల ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యాన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే రెడ్డి శాంతి పాల్గొన్నారు. లేగ దూడల ప్రదర్శన పోటీల్లో గెలుపొందిన యజమానులకు బహుమతులను అందించారు. కార్యక్రమంలో నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

వడదెబ్బ నివారణా చర్యలపై అవగాహన

అవగాహన కల్పిస్తున్న అనురాధ

ప్రజాశక్తి- జలుమూరు

రోజురోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతలు దృష్ట్యా వైద్య సిబ్బంది గ్రామాల్లో పర్యటించి వడదెబ్బ నివారణా చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా అదనపు డిఎంహెచ్ఒ డాక్టర్ అనురాధ సూచించారు. మండలంలోని సైరిగాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యంగా ఎండలో పనిచేసే ఉపాధి హామీ కూలీలకు వడదెబ్బ నివారణా చర్యలపై అవగాహన కల్పించాలని సూచించారు. ఒఆర్ఎస్ ప్యాకెట్లను ఉప కేంద్రాల వారీగా పంపిణీ చేయాలన్నారు. ఒఆర్ఎస్ ద్రావణం ఉపయోగాన్ని వారికి తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు గురునాధరావు, కొర్ను వైష్ణవి, డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ వాన సురేష్‌కుమార్, ఇఒ బి.ఎం.నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న ఉద్యోగులు

బకాయిలు చెల్లించాలని వినతి

ప్రజాశక్తి- ఆమదాలవలస

గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల బకాయిలను వెంటనే చెల్లించాలని వార్డు సచివాలయాల సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్ అబ్దుల్ రజాక్, కూన వెంకట సత్యనారాయణలు కోరారు. అమరావతిలోని సచివాలయంలో ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్‌ను గురువారం కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొదటి నోటిఫికేషన్ ద్వారా నియమితులైన లక్ష మందికి పైగా గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులను రెండేళ్ల పాటు ప్రొబేషన్ పూర్తి అవగానే ప్రొబేషన్ డిక్లేర్ చేయకుండా నిబంధనలకు విరుద్ధంగా 9 నెలలు ఆలస్యం చేసిందన్నారు. ఆ తొమ్మిది నెలలకు సంబంధించిన పూర్తి బకాయిలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఎపి గ్రామ, వార్డు సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మస్తానప్ప, కార్యదర్శి లక్ష్మీనారాయణ, కార్యవర్గ సభ్యులు పార్ష మధు, గుంటూరు జిల్లా కో-ఆర్డినేటర్ మణికంత, కృష్ణా జిల్లా కో-ఆర్డినేటర్ గోపీచంద్, ఎన్‌టిఆర్ జిల్లా కోఆర్డినేటర్ నవీన్, సత్య సాయి జిల్లా కో-ఆర్డినేటర్ శివరాజ్, రంగారావు, తోటయ్య, రాజారాం తదితరులు పాల్గొన్నారు.

జలుమూరు : మాట్లాడుతున్న ఎంఇఒ మాధవరావు

ఉపాధ్యాయులకు శిక్షణ

పలాస : ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలకు మంజూరు చేస్తున్న నిధులను సక్రమంగా వినియోగించుకోవాలని ఎంఇఒ సిహెచ్.శ్రీనివాసరావు ఉపాధ్యాయులకు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులకు పాఠశాల నిధులు, సామాజిక తనిఖీ, పాఠశాల పరిసరాల పరిశుభ్రతపై శిక్షణా కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో ఉన్న పాఠశాలలకు నాడు-నేడు కింద మరలా నిధులు మంజూరయ్యాయని, వాటిని మండల కేంద్రానికి తిరిగి ఇచ్చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు మండలంలో ఏ పాఠశాలకైనా నిధుల అవసరమైతే తన దృష్టికి తీసుకొస్తే ఒక్కో పాఠశాలకు కేవలం రూ.రెండు లక్షల వరకు నిధులు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని అన్నారు. కార్యక్రమంలో జిల్లా రీసెర్చ్ పర్సన్ చలపతిరావు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

జలుమూరు: ఈనెల 29న ప్రభుత్వ పాఠశాలల్లో జరుగుతున్న స్కూల్ ఆడిట్‌పై గురువారం ఎంఇఒ బమ్మిడి మాధవరావు ఆధ్వర్యాన మండలంలోని కరబంజ మోడల్ స్కూల్‌లో ప్రధానోపాధ్యాయులకు ఒక రోజు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేరెంట్స్ కమిటీ సభ్యులు ప్రభుత్వం నిర్దేశించిన ప్రత్యేక యాప్‌లో పలు ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చేలా వారికి అవగాహన కల్పించాలన్నారు. ఆయా పాఠశాలల్లో అన్ని అభివృద్ధి పనులకు సంబంధించిన రికార్డులను సోషల్ ఆడిట్‌కు సిద్ధం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ గణేష్ పట్నాయక్, డిఆర్‌పి రాజారావు పాల్గొన్నారు.

పరిశీలిస్తున్న చిరంజీవి నాగ్

ఓనిగెడ్డలో జంగిల్స్ తొలగించాలి

ప్రజాశక్తి- బూర్జ

మండలంలోని 17 గ్రామాలకు సాగునీటి ప్రయోజనం చేకూర్చే ఉద్దేశంతో 1957లో నిర్మించిన ఓనిగెడ్డ కెనాల్ ద్వారా వచ్చే ఖరీఫ్ సీజన్‌కు సాగునీరు అందించేలా చర్యలు చేపట్టాలని ఇరిగేషన్ సూపరింటెండెంట్ ఇంజినీర్ పొన్నాడ సుధాకర్‌ను వైసిపి యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవి నాగ్ సూచించారు. ఈ సందర్భంగా ఓనిగెడ్డను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఓనిగెడ్డలో నీటి నిల్వల కెపాసిటీ కంటే క్రమేపీ తగ్గుముఖం పట్టడం విషయంలో సాంకేతికపరమైన కారణాలను అన్వేషించాలన్నారు. ఆధునికీకరణ పనులపై శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం సిఎం జగన్ దృష్టికి తీసుకెళ్లారని తెలిపారు. ఉపాధి హామీ నిధుల ద్వారా కాలువ పొడుగునా జంగిల్స్ చేపట్టాలనానరు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి కర్నేన నాగేశ్వరరావు, జెడ్‌పిటిసి బెజ్జిపురపు రామారావు, వైసిపి మండల పార్టీ అధ్యక్షులు ఖండాపు గోవిందరావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గుమ్మడి రాంబాబు పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న సంఘం నాయకులు

సంఘం గుర్తింపు రద్దు అమానుషం

శ్రీకాకుళం అర్బన్ : తపాలాశాఖలో అత్యధిక సభ్యత్వం కలిగి ఉన్న నేషన్ ఫెడరేషన్ ఆఫ్ పోస్టల్ ఎంప్లాయీస్ సంఘాన్ని కేంద్ర ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా రద్దు చేసినట్లు ఉత్తర్వులు విడుదల చేసిందని, దీనిని వెనక్కి తీసుకోవాలని ఆ సంఘం కార్యదర్శి వేణుగోపాలరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు నగరంలోని హెడ్ పోస్టాఫీస్ కార్యాలయం ముందు గురువారం ధర్నా చేపట్టారు. రైతుల ఉద్యమానికి ఆర్థికసాయం అందించామనే షాక్‌తో సంఘం గుర్తింపు రద్దు చేసిందని అన్నారు. కార్యక్రమంలో జిల్లా పోస్టల్ ఉద్యోగ కార్యదర్శి గణపతి, వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి సుందరరావు, పెన్షనర్స్ అసోసియేషన్ కార్యదర్శి చంద్రశేఖర్, జిల్లా సాహితీ స్రవంతి కార్యదర్శి కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

టెక్కలి రూరల్ : టెక్కలి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యాన మండలంలోని చాకిపల్లి ఉన్నత పాఠశాలలో విద్యార్థులు-క్రమశిక్షణ అనే అంశంపై వ్యాసరచన, వక్తృత్వ పోటీలు గురువారం నిర్వహించామని కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు తెలిపారు. ఈ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలను, జ్ఞాపికలను ఐతమ్ పిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల డీన్ డాక్టర్ డి. విష్ణుమూర్తి, ఎన్‌ఎస్‌ఎస్ పిఒ డాక్టర్ బి.బలరాం, హెచ్‌ఎం ఎస్.శ్రీనివాసరావు, ఎంపిటిసి సభ్యులు పొందర శ్రీను, పాల్గొన్నారు.

చిత్రపటాలను చూపిస్తున్న విద్యార్థులు

గడప గడపతో పాలనలో జవాబురీతనం

ఆమదాలవలస : మాట్లాడుతున్న స్పీకర్ సీతారాం

శాసనసభ స్పీకర్ సీతారాం

ప్రజాశక్తి- ఆమదాలవలస

గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంతో పాలనలో జవాబుదారీతనం పెరిగిందని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. పురపాలక సంఘ పరిధిలోని 19వ వార్డు పాత ఆమదాలవలసలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం గురువారం నిర్వహించారు. వార్డులో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నవి లేనిది ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ సేవలు, పథకాలు తీరుతెన్నులపై లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. నేటి వరకు వివిధ సంక్షేమ పథకాల రూపంలో అందిన ఆర్థిక ప్రయోజనాలను లబ్ధిదారులకు వివరించారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి దళారులు లేని సంక్షేమ పాలనను ప్రజలకు అందిస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎం.రవిసుధాకర్, వార్డు సచివాలయాల కో-ఆర్డినేటర్ అల్లం శెట్టి ఉమామహేశ్వరరావు, వైసిపి నాయకులు బొడ్డేపల్లి రమేష్ కుమార్, బోర చిన్నంనాయుడు, మామిడి రమేష్, సాధు చిరంజీవి, కామేశ్వరరావు, సంపదరావు రామారావు, పొదిలాపు తిరుపతి, బండి ఎర్రం నాయుడు, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

రణస్థలం: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి పాలనలో గడపగడపకూ సంక్షేమ పథకాల ఫలాలు అందుతున్నాయని, అర్హులకు నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లోనే సంక్షేమ పథకాల లబ్ధి అందేలా ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు.

రణస్థలం : పోస్టర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే కిరణ్ కుమార్

రణస్థలంలోని గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంక్షేమ పథకాలతో ముద్రించిన పోస్టర్లను అందజేశారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి పిన్నింటి సాయికుమార్, ఎచ్చెర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రతినిధి లంకలపల్లి ప్రసాద్, జెడ్‌పిటిసి టొంపల సీతారాం, మండల పార్టీ అధ్యక్షులు మహంతి పెద్దరామునాయుడు, ఇన్‌ఛార్జి ఎంపిడిఒ ధనుంజయరావు, పంచాయతీరాజ్ ఎఇ కూర్మనాథం, విద్యుత్‌శాఖ ఎఇ శ్రీనివాసరావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ రామారావు, ఎపిఒ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వైసిపి పాలనలో రాష్ట్రం అప్పల కుప్ప

టిడిపి జిల్లా అధ్యక్షులు రవికుమార్

ప్రజాశక్తి- ఆమదాలవలస

వైసిపి పాలనలో రాష్ట్రం అప్పుల కుప్పగా తయారైందని టిడిపి జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్ అన్నారు. మండలంలోని కొరపాం, బుడితిపేట, సిరిసింపేట గ్రామాల్లో ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి వైసిపి పాలనలో ఎదురవుతున్న ఇబ్బందులను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అలాగే ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంక్షేమ పథకాలు ప్రజలకు అందిస్తున్నామని ఊదరగొడుతున్న ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి టిడిపి వ్యవస్థాపకుడు ఎన్‌టిపి సంక్షేమ పథకాలను ప్రజలకు పరిచయం చేసి పంపిణీ చేసిన విషయాన్ని గుర్తు ఎరగాలని, ఒకవేళ తెలియకుంటే తెలుసుకోవాలని సూచించారు. రెండు రూపాయలకు కిలో బియ్యం,

ఆమదాలవలస : ర్యాలీలో పాల్గొన్న రవికుమార్

వృద్ధాప్య, వితంతు పింఛన్లు, చీర దోవతి వంటి సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిన ఘనత తెలుగుదేశం పార్టీకే దక్కిందని అన్నారు. నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలో సంక్షేమం అభివృద్ధిని రెండు కళ్లుగా భావించి అమలు చేస్తుందని అన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల పార్టీ అధ్యక్షులు నూక రాజు, జిల్లా తెలుగు మహిళా అధ్యక్షులు తమ్మినేని సుజాత, సనపల ఢిల్లేశ్వరరావు, తమ్మినేని చంద్రశేఖర్, అన్నెపు భాస్కరరావు, సర్పంచ్‌లు చేపేన సత్తిరాజు, గొండు రమణ, రామ్‌శంకర్, కొండయ్య పాల్గొన్నారు.

నందిగాం: మండలంలోని పెద్దతామరపల్లిలో టిడిపి నాయకులు రాష్ట్రానికి ఇదేం కర్మ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా ధరల నియంత్రించాలని కోరుతూ వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి మండల తెలుగు యువత అధ్యక్షులు ఎం.బాలకృష్ణ, టి.మహేష్, తేజస్సు, జానకిరామ్, పోలాకి ఢిల్లేశ్వరం, ముదిలి సింహాచలం, నందిగామ తిరుపతిరావు, మోహనరావు, పి.సింహాద్రినాయుడు, ఎ.కూర్మారావు, కె.తాతయ్య పాల్గొన్నారు.

అధిక ధరలతో ఇదేం ఖర్మ మనకి

కోటబొమ్మాళి: మండలంలోని కొత్తపేట పంచాయతీలో టిడిపి నాయకులు నిర్వహించిన రాష్ట్రానికి ఇదేం కర్మ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు బోయిన రమేష్, మాజీ ఎంపిపి తర్ర రామకృష్ణ, వెలమల విజయలక్ష్మి, కామేశ్వరరావు, గొండు లక్ష్మణరావు, నంబాళ శ్రీనివాసరావు, మక్క లక్ష్మణరావు, పట్నాయక్, శ్రీను, బాబూరావు, తంగుడు సునీల్, హనుమంతు అప్పలరాజు, సాసుమంతు అనందరావు, పల్లి రాంబాబు, బెండి అన్నపూర్ణమ్మ, వాన లక్ష్మి, కింజరాపు యువసేన, కోట సంతోషకుమార్ పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు

బూర్జ : మండలంలో అన్ని గిరిజన గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన నిమిత్తం చేపడుతున్న సర్వేలో ఎంపిడిఒ ఎం.రవీంద్రబాబు, తహశీల్దార్ సనపల రామారావు గురువారం గిరిజన తండాలను సందర్శించారు. అందులో భాగంగా జంగాలపాడు అంగన్వాడీ కేంద్రం, పాఠశాలలకు మౌలిక సదుపాయాలను పరిశీలించారు. ప్రాథమిక పాఠశాలలో తాగునీటి సమస్యను గుర్తించారు. మధ్యాహ్న భోజన పథకంలో విద్యార్థులకు సాంబారు, అన్నం, టమాటా పచ్చడి, ఉడకపెట్టిన గుడ్డు స్వయంగా వడ్డించారు. గోపీదేవిపేటలో 20 మంది ప్రాథమికస్థాయి పిల్లలను గుర్తించారు. అనంతరం మాట్లాడుతూ ఇరువురి పిల్లలు ఏకరూప దుస్తులు ధరించలేదని, ఆవరణ పరిశుభ్రత ఉందని అన్నారు.

పలాస : మాట్లాడుతున్న ఎంపిడిఒ రమేష్‌నాయుడు

కార్యక్రమంలో అన్నంపేట కార్యదర్శి కె.రాంబాబు, హౌసింగ్ ఎఇ రమణమూర్తి, ఎ.పి.పేట కార్యదర్శి కె.పద్మ, ఇంజినీరింగ్ సహాయకులు ఇంద్రజ, వెల్ఫేర్ సహాయకులు ఎం.సాయిశంకర్, డొంకలపర్త కార్యదర్శి రామకృష్ణ, హితేంద్ర, మండల ఇంజినీరింగ్ అధికారి మౌనిక, ఆర్‌డబ్ల్యుఎస్ సైట్ ఇంజినీర్ నాయుడు పాల్గొన్నారు.

పలాస: గిరిజన గ్రామాలను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ చేపట్టిందని ఎంపిడిఒ ఎన్.రమేష్‌నాయుడు అన్నారు. మండలంలోని లొత్తూరు పంచాయతీ పరిధిలోని లొత్తూరు, చిన్న పలియా, పెద్ద పలియా, జన్నసాయి, పెద్ద గంతరు, చిన్న గంతరు తదితర గిరిజన గ్రామాల్లో గురువారం పర్యటించారు. బలహీన గిరిజన సమూహాలు జీవవన ప్రమాణాలపై సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గిరిజన గ్రామాల్లో తాగునీరు, రోడ్లు, మౌలిక సదుపాయాలు ఉన్నాయా? లేవా? తెలుసుకొని గిరిజన ప్రాంతాలను అభివృద్ధి చేస్తామని అన్నారు. ముందుగా గిరిజన ప్రాంతాల్లో ఉన్న బావులు బోర్లు పంచాయతీ కార్యాలయం, ప్రభుత్వ పాఠశాలలు తదితర ప్రభుత్వ సంస్థలను పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ విస్తరణ అధికారి మెట్ట వైకుంఠరావు, కార్యదర్శి జె.రుపేం ద్రరావు, సర్పంచ్ ప్రతినిధి సవర సీమాన్ పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థుల ప్రతిభ

పలాస : అభినందిస్తున్న ప్రిన్సిపాల్ వెంకటమోహన్

పలాస : ఇంటర్ ఫలితాల్లో పలాస ప్రభుత్వ జూనియర్ కళాశాల మంచి ఫలితాలను సాధించింది. ద్వితీయ ఏడాది 75 శాతం ఫలితాలు కళాశాల సొంతమయ్యాయి. ఎంపిసిలో మోనియా జుదిష్టి (962), జి.అనూష (929), మోహిని (907), కస్తూరి (900), బైపిసిలో వి.వెన్నెల (945), హెచ్‌ఇసిలో ఇప్పిలి చామంతి (925), ఎస్.రాజేశ్వరి (895), సిఇసిలో ఎస్.గీత (887), బి.జానకమ్మ (884) ప్రతిభ సాధించగా... ఒకేషనల్ విద్య కంప్యూటర్ సైన్స్‌లో కె.మోహన్ (890) మార్కులను సాధించారు. ప్రథమ సంవత్సరం ప్రథమ ఏడాది ఎంపిసిలో గాయత్రి (444), సౌమ్య (441), బైపిసిలో నీహారిక (420), హెచ్‌ఇసిలో నయామీ (411), సిఇసిలో ప్రసాద్‌రెడ్డి (414), కంప్యూటర్ సైన్స్‌లో ప్రసాద్ (454), సంజీత్ (451) మార్కులు సాధించారు. కాగా, ప్రతిభ సాధించిన విద్యార్థులకు గురువారం కళాశాలలో అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బాడ వెంకట మోహన్, అధ్యాపకులు హనుమంతు రామ్మోహన్ దొర, కొండల మధుబాబు, టి.పాపారావు, ఎ.శ్రీనివాసరావు, బి.ప్రసాదరావు, ఎ.ఝాన్సీ, ఎ.సరస్వతి, తపన్‌కుమార్ జెన్నా, జయప్రకాశ్ ఆచారి, కె.కేశవరావు పాల్గొన్నారు.

కొత్తూరు : ఇంటర్ ఫలితాల్లో కొత్తూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన ద్వితీయ సంవత్సరం విద్యార్థులు మంతిన పవిత్ర ఎంపిసిలో 964, అన్నెపు నీరజ ఎంపిసిలో 935, మార్కులు సాధించారు. ప్రథమ సంవత్సరంలో పేడాడ కావ్యశ్రీ ఎంపిసిలో 409, ఎం.ప్రశాంత్ ఎంపిటిసిలో 406, సారిపిల్లి గౌతమ్ 402 మార్కులు సాధించారు. నివగాం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వియ సంవత్సరం చదువుతున్న కె.రూప బైపిసిలో 928 మార్కులు సాధించింది.

మాట్లాడుతున్న చైర్మన్ గిరిబాబు

మహిళా అభ్యున్నతికి కృషి

పలాస : మహిళల అభ్యున్నతికు, సాధికారతకు ప్రభుత్వం కృషి చేస్తుందని పలాస మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు అన్నారు. పలాస మున్సిపల్ మెప్మా కార్యాలయంలో ఆర్‌పిలతో గురువారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం మహిళా పక్షపాతని, వారి సంక్షేమానికి అనేక పథకాల ప్రవేశపెట్టి ముఖ్యమంత్రి జగన్ ఆదుకుంటున్నారని అన్నారు. విధి నిర్వహణలో ప్రతిఒక్కరూ బాధ్యతగా పని చేసి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో టిఎంసి భాస్కరరావు, ఆర్‌పిలు పాల్గొన్నారు.

వైసిపి పాలనలో విద్యార్థులకు అన్యాయం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఎన్నో ఏళ్లుగా బిసి, ఎస్‌సి, ఎస్‌టి నిరుపేదలైన విద్యార్థులకు ఉన్నత తరగతుల వరకు ఉచితంగా ప్రభుత్వం విద్య నందిస్తూ వసతిగృహాలు, విద్యార్థులకు స్కాలర్‌షిప్, ఫీజు రీయంబర్స్‌మెంట్ సౌకర్యం కల్పిస్తున్నాయని, వాటిని పేర్లు మార్చిన సిఎం జగన్మోహనరెడ్డి ఉన్న వసతుల్లో కోతలు పెట్టి వసతి దీవెన అంటున్నారని టిఎన్‌ఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షులు బలగ ప్రహర్ష విమర్శించారు. నగరంలోని జిల్లా టిడిపి కార్యాలయంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. ప్రాథమిక విద్య నుంచి ఉన్నత చదువుల వరకు వసతిగృహాల్లో ఉండి చదువుకుంటున్న విద్యార్థులకు కనీస వసతులు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. నెలల తరబడి హాస్టల్ బిల్లులు చెల్లించకపోవడంతో సంక్షేమశాఖ అధికారులు ఇబ్బందులు పడుతూ విద్యార్థులకు నచ్చిన మెనూను

మాట్లాడుతున్న ప్రహర్ష

అమలు చేయాల్సి వస్తోందన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మెనూ పెంచాలని కోరారు. కాస్మోటిక్ ఛార్జీలు చెల్లించకపోవడంతో విద్యార్థులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. నాలుగేళ్లలో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు నిలిపి వేశారని, చలికాలంలో దుప్పట్లు కూడా ఇవ్వడం లేదని అన్నారు. సమావేశంలో టిఎన్‌ఎస్‌ఎఫ్ ప్రధాన కార్యదర్శి గుర్రాల సుమంత్, వైస్ ప్రెసిడెంట్ జమ్ము సంతోష్‌కుమార్, నరసింహనాయుడు వరుణ్, కొయ్యన సంతోష్, గొద్దు సాయి, సిహెచ్.వికాస్ పాల్గొన్నారు.

'ఉపాధి'ని నిర్వీర్యం చేస్తున్న కేంద్రం

ఎంపిడిఒకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ప్రజాశక్తి- పలాస

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తున్నారని సిపిఐఎంఎల్ లిబరేషన్ కేంద్ర కమిటీ సభ్యులు ఎం.మల్లేశ్వరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశ వ్యాప్తంగా ధర్నాలో ఎంపిడిఒ కార్యాలయం వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. అనంతరం ఎంపిడిఒ ఎన్.రమేష్‌నాయుడుకు వివిధ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వలస కూలీలను అరికట్టి ఉపాధి హామీని కాపాడాలని డిమాండ్ చేశారు. ప్రజా వ్యతిరేక విధానాలను అమలు చేస్తున్న ప్రభుత్వాలను ఎండగట్టాలని పిలుపునిచ్చారు. 200 రోజులు పని కల్పించాలని, రోజుకు రూ.600 కూలి ఇవ్వాలని డిమాండ్ చేశారు. విద్య, ఆరోగ్యం ప్రయివేటీకరణను నిలుపుదల చేయాలని అన్నారు. కార్యక్రమంలో సిపిఐ యంయల్ లిబరేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తామాడ సన్యాసిరావు, మద్దిల రామారావు, దున్న శ్రీనివాసులు, పోతనపల్లి కామేశ్వరరావు, అప్పారావు, దుష్యంత్, అప్పయ, పాపయ్య, రామకృష్ణ, యుగంధర్, కె.ఈశ్వరి, పి.సుందరమ్మ పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ చేస్తున్న వాకర్స్

మజ్జిగ పంపిణీ

శ్రీకాకుళం అర్బన్ : మారుతీ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యాన సాయి మందిర కమిటీ సభ్యులు పైడి రాజ్యలక్ష్మి, అప్పారావు దంపతులు, కొంక్యాన గోవిందరాజులు ఛారిటబుల్ ట్రస్టు, జిల్ ఫౌండేషన్ సహకారంతో నగరంలోని విశాఖ-బి కాలనీలో గురువారం మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వాకర్స్ ఇంటర్నేషనల్ 102 డిప్యూటీ గవర్నర్, మారుతీ వాకర్స్‌క్లబ్ అధ్యక్షుడు కొంక్యాన మురళీధర్ మాట్లాడుతూ ఏటా వేసవి కాలంలో మారుతీ వాకర్స్ క్లబ్, కొంక్యాన గోవిందరాజులు ఛారిటబుల్ ట్రస్టు తరపున మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎపిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కొంక్యాన వేణుగోపాల్, మందిర కమిటీ ట్రెజరర్ ఇప్పిలి భవాని, కార్యదర్శి శేఖర్‌బాబు పాల్గొన్నారు.

పౌష్టికాహార కిట్లు పంపిణీ

మెళియాపుట్టి : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో 21 మంది క్షయ రోగులకు గురువారం పౌష్టికాహారం కిట్లను వైద్యాధికారిని గ్రీష్మ పంపిణీ చేశారు. ఆయిల్ ప్యాకెట్, రెండు పాల ప్యాకెట్లు, ఖర్జూరం, కందిపప్పు, కాబూలీ సెనగలు, కొమ్ము సెలుగలు, బెల్లం, వేరుశెనగ గుడ్లు, అలసందలుతో కూడిన కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వీటిని క్రమ పద్ధతిగా వాడుకోవడం వల్ల ఆరోగ్యం మెరుగవుతుందని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

కిట్లను అందజేస్తున్న వైద్యాధికారి గ్రీష్మ

రికార్డులను పరిశీలిస్తున్న సిడిపిఒ పాపినాయుడు

అంగన్వాడీ కేంద్రం తనిఖీ

ప్రజాశక్తి- పొందూరు

అంగన్వాడీ కేంద్రాలను ప్రతినెలా తప్పనిసరిగా సూపర్‌వైజర్లు తనిఖీలు నిర్వహించామని, ఈ తనిఖీలపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని సిడిపిఒ డోల పాపినాయుడు పేర్కొన్నారు. బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు ఆదేశాలు మేరకు గురువారం మండలంలోని కింతలిలో అంగన్వాడీ కేంద్రం-1, 3లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించగా కేంద్రంపై పర్యవేక్షణ సరిగ్గా లేదని గుర్తించామన్నారు. అంగన్వాడీ కేంద్రాల తనికీలను సూపర్‌వైజర్లు మొబైల్ యాప్‌లో నమోదు చేసినా ఆయా కేంద్రాల్లోని విజిట్ బుక్‌లో నమోదు చేయాలని సూచించారు. కేంద్రానికి చిన్నారులు, బాలింతలు, గర్భిణులు వస్తేనే హాజరు వేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పైడి రాంప్రసాద్, సూపర్‌వైజర్ జి.వి.రత్నం పాల్గొన్నారు.

కోల్డ్‌స్టోరేజీని నిర్మించాలని వినతి

వినతిపత్రం అందజేస్తున్న శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి

ఇచ్ఛాపురం : ఇచ్ఛాపురం నియోజకవర్గం పరిధిలో కవిటి, సోంపేట మండలాల్లో ఉన్న మత్స్యకారులకు మినీ యాంకరింగ్ జెట్టి, కోల్డ్ స్టోరేజ్ నిర్మాణానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సీడప్ చైర్మన్ సాధి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి కోరారు. ఈ మేరకు విశాఖపట్నంలోని మారిటైమ్ బోర్డ్ చైర్మన్ కాయల వెంకటరెడ్డిని గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. బారువ బీచ్‌లో వసతులు కల్పించాలని విన్నవించారు. ఈ విషయంపై ఆయన సానుకూలంగా స్పందించారని శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి తెలిపారు. వచ్చే నెల పర్యటనకు వచ్చి పరిశీలించి అనంతరం కార్యాచరణ ప్రారంభిస్తామని తెలియజేశారని అన్నారు.

రేపు మున్సిపల్ సమావేశం

కాశీబుగ్గ : పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ సాధారణ సమావేశం ఈ నెల 29న ఉదయం 11 గంటలకు కౌన్సిల్ సమావేశ మందిరంలో నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు హాజరు కావాలని కోరారు.

పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి

తహశీల్దార్ కార్యాలయం పరిశీలన

మెళియాపుట్టి : నూతన తహశీల్దార్ కార్యాలయాన్ని టెక్కలి సబ్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి గురువారం పరిశీలించారు. పనులు నాణ్యతపై అసంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం దీనబంధుపురం, చాపర వద్ద ఉన్న జనగన్న లేఅవుట్లను పరిశీలించారు. ఈయనతో పాటు తహశీల్దార్ పి.సరోజని, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

కేక్ తినిపిస్తున్న విజయ

ఘనంగా నరేంద్ర యాదవ్ జన్మదినం

ఇచ్ఛాపురం : పిఎం ఎస్ అధ్యక్షులు నర్తు నరేంద్ర యాదవ్ జన్మదిన వేడుకలు గురువారం ఘనంగ నిర్వహించారు. నరేంద్ర యాదవ్ సేన ఆధ్వర్యాన స్థానిక పిఎసిఎస్‌లో కేక్‌ను కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. కార్యక్రమంలో జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ, మాజీ ఎమ్మెల్యే సాయిరాజ్, జెడ్‌పిటిసి ఉప్పాడ నారాయణమ్మ, మున్సిపల్ చైర్మన్ ప్రతినిధి పిలక సంతోష్‌రెడ్డి, క్రిస్టియన్ మైనార్టీ సెల్ జిల్లా కన్వీనర్ ప్రత్తి అన్వేష్, దువ్వు వివేకానందరెడ్డి, ఎఎంసి చైర్మన్ బూరావు, స్వర్ణభారతి విద్యాసంస్థల చైర్మన్ చాట్ల తులసీదాస్‌రెడ్డి, కవిటి ఎంపిపి ప్రతినిధి కడియాల ప్రకాష్ యాదవ్, సోంపేట జెడ్‌పిటిసి ప్రతినిధి తడక జోగారావు, సర్పంచ్‌లు నర్తు వరప్రసాద్, బద్రి ప్రకాష్, ఇసురు తులసీరామ్‌రెడ్డి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న భగవాన్

ఉద్యాన పంటలపై అవగాహన

ప్రజాశక్తి- బూర్జ

మండలంలోని పెద్దపేటలో డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయ పరిశుద్ధ కేంద్రంలో డాక్టర్ కె.వి.కె.భగవాన్ ఆధ్వర్యాన గురువారం ఉద్యాన పంటలపై రైతులకు అవగాహన కల్పించారు. రైతులు తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలు పొందేందుకు సాధ్యమని వివరించారు. కొబ్బరి, ఇతర పంటలను గురించి అవగాహన కల్పించారు. తక్కువ నీటితో వర్షాధారాలతో పంటలు సాగు చేసేందుకు యాజమాన్య పద్ధతి గురించి మరింత అవగాహన కల్పించారు. కొబ్బరి, ఇతర పంటలకు గ్లోబ్లోస్ వంటి తెల్లదోమ నివారణకు ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రాజేశ్వరరావు, వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

పద్దలో పారిశుద్ధ్య పనులు

మెళియాపుట్టి : మండలంలోని పద్ద గ్రామంలో పారిశుద్ధ్య పనులను సర్పంచ్ మజ్జి రాము, పంచాయతీ కార్యదర్శి చింతల అప్పారావు ఆధ్వర్యాన గురువారం చేపట్టారు. గ్రామంలో అమ్మవారి సంబరాలు నిర్వహించనున్న దృష్ట్యా ఈ పనులను ముమ్మరంగా చేపట్టారు. డ్రెయినేజీలో పేరుకుపోయిన పూడికతీత, బోర్ల మురుగునీరు, చెత్తా చెదారాలను తొలగించి డంపింగ్ యార్డుకు తరలించారు. అనంతరం కాలువల్లో బ్లీచింగ్ జల్లి ప్రజలకు అవగాహన కల్పించారు.